ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

బుధవారం 23 అక్టోబరు 2024

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో 204 ఖాళీలు
- ప్రభుత్వ ఆదేశాలు రావడంతోనే నోటిఫికేషన్
- 123 మంది ఉద్యోగ విరమణ
- 292 కేంద్రాల్లో ప్రీ స్కూల్ పాఠాలు
- సిరిసిల్ల, వేములవాడ ప్రాజెక్టుల పరిధిలో 43,646 మంది లాభోక్తులు
- పి లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి

ఇంటర్వ్యూ



పి లక్ష్మీరాజం జిల్లా సంక్షేమ అధికారి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నా యని, జిల్లాలో పోషకాహారం అందించడంతోపాటు చిన్నారులకు పూర్వవిద్యను అందిస్తున్నామని మహిళల, పిల్లల, వికలాంగుల, వయోవృద్ధులశాఖ జిల్లా అధికారి పి.లక్ష్మీరాజం అన్నారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలభర్తీకి ప్రభుత్వ ఆదేశాలు రావ డంతోనే ప్రక్రియ చేపడతామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 123 మంది పదవీ విరమణ పొందారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో 204 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అంది స్తున్నట్లు చెప్పారు. మంగళవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఎన్ని ఉన్నాయి?

జిల్లా సంక్షేమ అధికారి: జిల్లాలో 204 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 51 మంది టీచర్లు, 153 మంది ఆయాల పోస్టులు ఉన్నాయి. ప్రభుత్వ ఈదేశాలు వచ్చిన 48 గంటల్లో నోటిఫికేషన్ ఇస్తాం. గతంలో ఖాళీల భర్తీకి టీచర్లకు పదోతరగతి, ఆయాలకు 7వ తరగతి ఉత్తీర్ణత ఉంటే సరిపోయేది. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా టీచర్లకు, ఆయాలకు ఇంటర్ ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు.

మిగితా 8లో

న్యూస్ బాక్స్

మూగ జీవాలకు టీకాలు వేయించాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు పశువులకు టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లో గాలికుంటు నివారణ టీకా పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. పశువుల్లో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. వైద్యాధికారులు రాహుల్, రేణుక, సిబ్బంది శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

సిరిసిల్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరేందర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో రమేష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో విచారణ చేపట్టగా పలువురు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని తేలినట్లు, దీంతో సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొ న్నారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు జిల్లాను వదిలి వెళ్లవద్దని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కోనరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొలనూరు, నాగారంలో మంగళవారం కొల నూరు సింగిల్ విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ మహేష్, బొమ్మన భాస్కర్ పాల్గొన్నారు.

డిజిటల్ సర్వే లేనట్లేనా..?

- క్రాప్ సర్వేపై ఏఈవోల విముఖత
- ప్రారంభమైన వానాకాలం వరి కోతలు
- ఈ సీజన్‌లో డిజిటల్ సర్వే కష్టమే
- ఇప్పటికే పనిభారంతో ఏఈవోలు సతమతం
- జిల్లాలో వానాకాలం సీజన్ 2.32 లక్షల ఎకరాల్లో పంటలు



జిల్లాలో ఖరీఫ్‌లో సాగైన పంటలు (ఎకరాల్లో)

మండలం	వరి,	పత్తి
గంభీరావుపేట	18,800	220
ఇల్లంతకుంట	24,000	12,412
ముస్తాబాద్	22,000	760
సిరిసిల్ల	4550	780
తంగళ్లపల్లి	19,010	1300
వీర్నపల్లి	6800	514
ఎల్లారెడ్డిపేట	16,950	3900
బోయినపల్లి	13000	6795
చందుర్తి	15,500	5800
కోనరావుపేట	17,850	4601
రుద్రంగి	5500	3200
వేములవాడ	5200	5100
వేములవాడరూరల్	11,150	3950
మొత్తం	1,80,310	49,332

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగానికి సంబంధించి పక్కా ప్రణాళికలను రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రీ మిషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)ను ప్రారంభించింది. అయితే ప్రస్తుతం ఉన్న పనిభారానికి తోడు డిజిటల్‌సర్వే చేయలేమని జిల్లాలోని ఏఈవోలు చెప్పడంతో ఇంకా మొదలు కాలేదు. దేశంలో ఆంధ్రప్రదేశ్ మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్య ప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల్లో గతేడాది నుంచి సర్వే కొనసాగుతోంది. తెలంగాణలో ఈ సంవత్సరం వానాకాలం సీజన్ నుంచి అమల్లోకి తెచ్చినా సిబ్బంది కొరత ఇతర కారణాలతో సర్వే మొదలు కాలేదు.

సర్వేతో అదనపు భారం

తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే దిశగా ప్రణాళికలు రూపొందించడానికి వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈవో) నియమించారు. ఒక్కొక్కరికి 5వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూమిని కేటాయిస్తూ క్లస్టర్‌లుగా బాధ్యతలు అప్పగించారు. క్లస్టర్ పరిధిలో ఆ గ్రామాల్లోని రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి సల హాలు, సూచనలు ఇవ్వాలి. దీంతోపాటు రైతుబీమా, పంటల సాగు, రుణమాఫీ వంటి పథకాల వివరాలు సేకరించేవారు. ఇదే క్రమంలో క్రాప్‌బుకింగ్ సర్వే కూడా చేసేవారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచి డిజిటల్ క్రాప్‌సర్వే చేయాలని నిర్ణయించింది. ఏఈవోలు మాత్రం ఇది తమకు అదనపు భారమని పేర్కొంటూ సర్వే చేయలేమని చెబుతున్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో పాటు ఉన్నత అధికారులకు వినతిపత్రాలు అందించారు. ఒక్కో గ్రామంలో ఉన్న సర్వే నంబర్లలోని డివిజన్‌లవారీగా రైతుల పంటల సాగు వివరాలు, ఫొటోను వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలి. వేల ఎకరాల్లో సర్వే నంబర్లతో నమోదు చేయడం ఇబ్బందికరమని పేర్కొంటున్నారు. దీనికి తోడుగా ఏఈవోల్లో మహిళలు కూడా ఎక్కువగానే ఉన్నారు. క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్లి సర్వే చేసే క్రమంలో విషసర్పాలతోపాటు జన సంచారం లేని ప్రాంతాల్లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని భయాందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారు సర్వేకు దూరంగా ఉండడంతో ఈసారి డిజిటల్ సర్వే లేనట్లుగా భావిస్తున్నారు.

....మిగితా 8లో

కుమరం భీమ్ ఆదివాసీ విప్లవవీరుడు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

- ఘనంగా కుమరం భీమ్ జయంతి



నివాళులర్పిస్తున్న నాయకులు

8

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- రుద్రంగిలో పాఠశాల తనిఖీ



బోధిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

8

క్రమం తప్పకుండా కళాశాలకు రావాలి

చందుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ప్రణాళికా బద్ధంగా చదవాలని అన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆనంతరం అధ్యాపక బృందంతో మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని, ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్నారు.

ఎల్ఆర్ఎస్ స్ర్కూటినీ పూర్తి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్ర్కూటినీ సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణ ప్రాంతాలు, ఇతర గ్రామీణ ప్రాంతాలలో వచ్చిన మొత్తం 42,942 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, వివరాలను మండలాల వారీగా తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్ర్కూటినీ ప్రక్రియ నాలుగు దశలలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. సర్వే నంబర్ల వారీగా సంబంధిత రెవెన్యూ బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్, నాలా, చెరువులు, హెరిటేజ్, బిల్డింగ్, డిఫెన్స్ ల్యాండ్ పరిధిలో వస్తుందో లేదో చెక్ చేసి ధ్రువీకరించాలన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ లెవల్ సర్వే ధ్రువీకరణ ప్రక్రియ దరఖాస్తులు ఉంచడం లేదా తొలగించడం పక్కాగా జరగాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఇన్‌చార్జి డీపీవో శేషాద్రి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా





గంభీరావుపేటలో కోతులు, కుక్కలు

గ్రామాల్లో కోతులు, కుక్కల బెడద

గంభీరావుపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో అటు కుక్కలు, ఇటు కోతులు ప్రజలను భయందోళనలకు గురి చేస్తున్నాయి. కోతులు ఏకంగా ఇళ్లలోకి దూరి గందర గోళం సృష్టిస్తున్నాయి. ఇళ్లలోని తిను బండరాలను ఎత్తుకెళ్తున్నాయి. ఈ క్రమంలో అడ్డుకునే ప్రయత్నం చేస్తే దాడి చేస్తున్నాయి. గతంలో కోతుల భయంతో మండల కేంద్రంలో ఓ మహిళ నీటి కుండిలో పడి ప్రాణాలు వదిలింది. మరోవైపు కుక్కలు రోడ్లపై బైక్‌లను వెంటాడుతున్నాయి. కుక్కలు భయంతో బైక్‌లపై వెళ్లాలంటే భయంతో జంకుతున్నారు. ఇటీవల లక్ష్మీపూర్ వద్ద బైక్ మీద వస్తున్న ఓ వ్యక్తిని కుక్కలు వెంబడించడంతో భయంతో ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొని మృతి చెందాడు. ప్రధానంగా మండల కేంద్రంలో కుక్కలు, కోతుల బెడదమరీ ఎక్కువైంది. చిన్న పిల్లలు స్కూల్‌కు వెళ్లాలన్నా కుక్కలు, కోతుల భయం వెంటాడుతోంది. నిత్యం అవసరాల నిమిత్తం బయటికొస్తే చేతిలో కర్ర పట్టుకొనే దుస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించాలని, కోతులు, కుక్కల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ టీవీ ఇన్‌స్టలేషన్, సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత కోసం ఏర్పాటు చేసిన రెండు నెలల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కష్టపడి పని చేయాలనే యువత కోసం ఉద్యోగ అవకాశాలు క్యూ కడతాయని, యువత ఖాళీగా ఉండకుండా విద్యార్హతకు తగిన ఉద్యోగం పొందాలని అన్నారు. ఎన్జీవో సహకారంతో రెండు నెలల ఉచిత వసతి, భోజన సదుపాయంతో 25 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎన్జీవో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

చందుర్తి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డీఈవో రమేష్ కుమార్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలన్నారు. ప్రతీరోజు పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎంఈవో వినయ్ కుమార్, ప్రధానోపాధ్యాయిని వేముల సుజాత తదితరులు ఉన్నారు.

వేములవాడలో ఆటోమేటిక్ కెమెరాల ఏర్పాటు

వేములవాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆటోమేటిక్ కెమెరాలను ఏర్పాటు చేశారు. రాజన్న ఆలయం ముందు భాగంలోని మెయిన్ రోడ్డుతోపాటు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ఈ కెమెరాల ద్వారా ట్రాఫిక్ నియమ నిబంధనలను అతిక్రమించే వాహనదారులను గుర్తించి ఆటోమేటిగ్గా జరిమానా విధించనున్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపించడం, రాంగ్ రూట్లో వెళ్లడం, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపించడం వంటి వాటిని గుర్తించి జరిమానా పంపించనున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ వెల్లడించారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. దీని ద్వారా జరిమానా తప్పించుకోవడంతోపాటు ప్రమాదం జరిగే సమయాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని పేర్కొన్నారు.

ధాన్యం విక్రయానికి అన్నదాతల అవస్థలు

- కొనుగోళ్లకు స్థలం లేక బైపాస్ రోడ్డుపై ఆరబోత
- వాహనాదారుల ఇబ్బందులు
- స్థలం కేటాయించాలని రైతుల విజ్ఞప్తి



సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులో ఆరబోసిన ధాన్యం

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ధాన్యాన్ని విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో సిరిసిల్ల అర్బన్ పరిధిలోని ఏడు గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చంద్రంపేట, రగుడు, చిన్నబోనాల, ముష్టిపల్లి, పెద్దబోనాల, పెదూర్, సర్థాపూర్ గ్రామాల్లో 20 రోజుల నుంచి వరికోతలు ప్రారంభమ్యాయి. కేంద్రాలకు స్థలాలు లేకపోవడంతో గ్రామాలకు ఆనుకోని ఉన్న రెండో బైపాస్ రోడ్డులో ఒక వైపు రోడ్డును మూసివేసి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు జంక్షన్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు 11 కిలోమీటర్ల ఫోర్‌లైన్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైండర్‌లలో విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేశారు. వాటికి విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వకపోవడంతో పాటు ఆ రోడ్డుపై రైతులు పోసిన ధాన్యం కుప్పలు వాహనాదారులకు చీకట్లో కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. అర్బన్ పరిధిలోని పెద్దూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గ్రామ శివారులోని మైసమ్మ చెరువు శిఖంలో ఏర్పాట చేశారు. సరైన వసతులు లేకపోవడంతో రైతులు సైతం రెండో బైపాస్ రోడ్డులోనే ఆరబెడు తున్నారు. చిన్నబోనాలలో మెప్మా ఆధ్వర్యంలో సర్వ సతి సమాఖ్య ద్వారా ప్రతిసారీ కొనుగోలు చేస్తుంటారు. రెండో బైపాస్ రోడ్డుపై ఇటీవల రైతులు ధాన్యాన్ని అరబెట్టడంతో చంద్రంపేటకు చెందిన వేముల శేఖర్ అనే యువకుడు ధాన్యం కుప్పలు చీకట్లో కనిపించక ద్విచక్రవాహనం పైనుంచి పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఏడు గ్రామాలకు చెందిన కౌన్సిలర్లు, నాయకులతో పోలీసులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రెండో బైపాస్ రోడ్డులో ఒక వైపు మాత్రమే ధాన్యాన్ని పోసి ఆరబెట్టుకోవాలని అంతేకాకుండా డివైండర్‌ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కౌన్సిలర్లు నిర్వాహకులతో సమావేశాలను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కొనుగోలుకు స్థలాన్ని కేటాయించాలి

- ఎరవెళ్లి వెంకటరమణారావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్



పెద్దూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా గ్రామ శివారులోని మైసమ్మ చెరువు శిఖంలో వసతులు లేకుండా కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన వసతులతోపాటు ఆరబెట్టేందుకు సౌకర్యం లేదు. రెండో బైపాస్ రోడ్డుపై అరబెట్టుకొని అక్కడే విక్రయిస్తున్నాం. కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాలకు ఐదు ఎకరాల చొప్పున స్థలం కేటాయించాలి.

వాహనదారుల ఇబ్బందులు

- బోల్గం నాగరాజుగౌడ్, కౌన్సిలర్ , చిన్నబోనాల



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విలీనం చేసిన ఏడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేవు. ప్రతీ సీజన్‌లో రైతులు ధాన్యాన్ని విక్రయించడం కోసం ఇబ్బం దులు పడుతున్నారు. దీంతో రెండో బైపాస్ రోడ్డును నమ్ముకొని ఆర బెట్టుకుంటున్నారు. జిల్లా అధికార యంత్రాగం స్పందించి గ్రామాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు స్థలం చూపించాలి.





చిగురుమామిడి నర్సరీలో పెరుగుతన్న ఆయిల్ పామ్ మొక్కలు

ఆయిల్‌పామ్ తోటలు మెట్ట రైతుకు వరంగా మారనున్నాయి. తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో ఈ పంట సాగు చేయవచ్చు. మరోవైపు అంతరపంటగా ఇతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చు. చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ నర్సరీ నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మొక్కలు సరఫరా చేస్తున్నారు.

మెట్ట రైతుకు వరం.. ఆయిల్‌పామ్ తోటలు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- చిగురుమామిడి నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలు

చిగురుమామిడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పంట వేయాలన్నా కోతుల బెడద తీవ్రంగా ఉన్నది. దీంతో రైతులు వరి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు కొరత ఏర్పడినపుడు వరి పంట ఎండిపోయి తీవ్రంగా నష్టం జరుగుతోంది. ముఖ్యంగా యాసంగి సాగులో రైతులు సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టపోతున్నారు. మెట్ట రైతులకు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. కొందరు రైతు పంట సాగుకు ముందుకు వస్తున్నారు.

● ఎకరంలో 57 మొక్కలు

ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చు. ఎకరం వరి పంటకు కావాల్సిన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ తోట సాగుచేయవచ్చు. తక్కువ కూలీల ఖర్చు ఉంటుంది. ఆయిల్ పామ్ సాగుచేస్తున్న తోటలో అంతర పంటలు వేసుకుంటున్న రైతులకు ఎరువులకు, ఇతర ఖర్చులకు సంవత్సరానికి 4,200 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎకరంలో 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు. గతంలో టన్ను ధర 14,000 రూపాయలు ఉండేది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ తోటలకు ప్రోత్సాహం ఇస్తూ టన్ను ధర 17,000 రూపాయలకు పెంచింది.

● సబ్సిడీపై డ్రిప్ పంపిణీ

గత ప్రభుత్వంలో పామాయిల్ సాగుకు సబ్సిడీపై డ్రిప్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు వందశాతం సబ్సిడీతో డ్రిప్ అందిస్తున్నారు. బీసీ ఇతర సామాజిక వర్గాలకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నారు. ప్రతి రైతు 20 రూపాయాలతో ఒక మొక్క పొందవచ్చు. మొక్కధర 200 రూపాయలు ఉండగా ప్రభుత్వం 180 రూపాయల సబ్సిడీ అందిస్తోంది. ఆయిల్‌పామ్ మొక్కలు పెంచాలనుకునే రైతులు ధ్రువపత్రాలతో వ్యవసాయశాఖ అందికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ తోటలు పెంచవచ్చు

- గొర్ల పరమేశ్వర్, రైతు, బొమ్మనపల్లి

అన్ని పంటలకన్నా అయిల్ పామ్ తోటలు తక్కువ పెట్టుబడితో పెంచవచ్చు. సాగునీటి కొరత ఉన్న ప్రాంతంలో ఈ మొక్కలు పెంచితే లాభదాయకం. అధికారులు రైతులకు మరింత అవగాహన కల్పించి అయిల్ పామ్ తోటలు పెంచేలా ప్రోత్సహించాలి.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

-జనవేని రాజమల్లు, రైతు, ఉల్లంపల్లి

సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉంటే అన్ని పంటల కన్నా ఆయిల్ పామ్ సాగు చాలా సులభం. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడి ఉంటుంది. కోతుల బెడద ఉండదు. పంటలకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. అంతర పంటగా అన్ని రకాల పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చు. పంట సాగుకు రైతులు ముందుకు వస్తే మార్కెటింగ్ సౌకర్యం ఉంటుంది.

చిగురుమామిడిలో రైతకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ మ్యాదరబోయిన ప్రవీణ్



అక్రమ కట్టడాల కూల్చివేత

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లో ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది కూల్చి వేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 669 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాల మేరు మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు ఆర్ఐ కనకరాజు, కార్యదర్శి లచ్చయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు.

రూ. 6,800 పలికిన పత్తి ధర


జమ్మికుంట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 196 మంది రైతులు 1,630క్వింటాళ్లు విడి పత్తి, 15 మంది రైతులు 26 క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై ఆర్టీసి బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన జింక మల్లేశం కరీంనగర్ వైపునకు తన ద్విచక్ర వాహనంపై వెలుతుండగా ఇందిరానగర్ వద్ద వెనుక నుంచి ఆర్టీసి బస్సు ఢీకొట్టి వెళ్లిపోయింది. ద్విచక్ర వాహనం పైనుంచి మల్లేశం కిందపడటంతో గాయాలు కాగా స్థానికులు గమనించి కరీంనగర్ అనుపత్రికి తరలించారు.

తాళం పగులగొట్టి చోరీ

జమ్మికుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాకాలనికి చెందిన బోగం లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. లక్ష్మి ఈ నెల 18న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంటి సమీపంలో ఉన్న కుమార్తెకు ఫోన్ చేసి ఇంటి వైపు చూడమని చెప్పింది. మంగళవారం ఉదయం ఇంటి తాళం తీసి ఉండటాన్ని గమనించిన కుమార్తె తల్లికి సమాచారం అందించింది. హుటాహుటిన వచ్చిన తల్లి ఇంట్లోకి వెళ్లి చూడగా, నగదు, వెండి, బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రవికుమార్ తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కారుతో ఢీ కొట్టి.. కత్తితో పొడిచి..

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడి దారుణ హత్య - కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ధర్నా, - హత్యకు రాజకీయ కక్షలే కారణమంటూ ఆరోపణ



మారు గంగారెడ్డి(ఫైల్)

జగిత్యాల క్రైం/జగిత్యాల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి(58) మంగళవారం దారుణ హత్యకు గురయ్యాడు. కారుతో ఢీ కొట్టి.. కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలోని జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్‌లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జాబితాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, జీవన్‌రెడ్డికి రాజకీయంగా అనుచరుడిగా పేరున్న మారు గంగారెడ్డి మంగళవారం ఉదయం గ్రామ కూడలిలో దారుణ హత్యకు గురయ్యాడు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న గంగారెడ్డిని అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్‌గౌడ్ అనే యువకుడు కారుతో వెనుకనుంచి ఢీ కొట్టాడు. అదుపు తప్పి కింద పడిన గంగారెడ్డిని అందరూ చూస్తుండగానే కత్తితో ఛాతితో పాటు కడుపులో విచక్షణా రహితంగా పొడిచాడు. అనంతరం వేరే కారులో తన అనుచరులతో కలిసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన గంగారెడ్డిని కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీవన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు.

● మూడు గంటలకు పైగా ఆందోళన...

గంగారెడ్డి హత్య విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. హత్యకు ఇటీవల చేరిన కాంగ్రెస్ నాయకుడే కారణం అంటూ ఆరోపించారు. జగిత్యాల-ధర్మపురి ప్రధాన రహదారి ఇందిరా చౌక్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సైతం ధర్నాలో పాల్గొని పోలీసుల తీరుపై మండిపడ్డారు. దీంతో ఎస్పీ అశోక్‌కుమార్ రంగప్రవేశం చేసి విప్‌తో పాటు ఎమ్మెల్సీతో గంటకు పైగా మంతనాలు జరిపారు. హత్యకు పాల్పడ్డ నిందితుడిని పట్టుకుని శిక్షిస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● దసరా పండుగ నుంచే స్కెచ్..

గంగారెడ్డిని హత్య చేసేందుకు అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్ దసరా పండుగ నుంచే స్కెచ్ వేసినట్లు గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనలు చెబుతున్నాయి. గంగారెడ్డి గ్రామంలో ఏ సమస్య ఉన్నా పెద్ద మనిషిగా వ్యవహరించేవాడు. సంతోష్‌గౌడ్‌కు తన కుటుంబసభ్యులకు భూసమస్యలు ఉన్నాయి. ఈవిషయంలో గంగారెడ్డి పెద్ద మనిషిగా తనకు వ్యతిరేకంగా ఉన్నాడని కక్ష పెంచుకున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ఇటీవల బతుకమ్మ, దసరా పండుగల వేడుకల్లో సైతం సంతోష్‌గౌడ్‌కు గంగారెడ్డికి మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఇదే కారణంతో రాజకీయంగా గంగారెడ్డి ఉనికి లేకుంటా చేసేందుకు కొంతమంది స్కెచ్ వేసి సంతోష్ గౌడ్‌తో హత్య చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● సీఎంవో, సీఎస్ దృష్టికి తీసుకెళ్లిన అడ్లూరి...

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి హత్యకు గురైన సంఘటను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లారు. సీఎం కార్యదర్శితో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి కాంగ్రెస్ నాయకుడి హత్య గురించి వివరించారు. హత్య ఉదంతంపై పోలీసుల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడికి ప్రాణభయం ఉందనే విషయాన్ని పోలీసుల దృష్టికి ముందుగానే తీసుకెళ్లినా రక్షణ కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● మీపార్టీకి.. మీకూ ఓ దండం..

కాంగ్రెస్ నాయకుడి హత్య విషయాన్ని తెలుసుకున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ చీఫ్‌పై అసహనం వ్యక్తం చేశాడు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ పార్టీ మంచి బహుమతి ఇచ్చిందన్నారు. 'మీ పార్టీకి... మీకు ఓ దండం అంటూ.. మీ పార్టీలో నేను ఇక ఉండనూ.. ఇకనైనా బతకనివ్వండి' అంటూ ఫోన్ కట్ చేశారు.

● హత్యను ఖండించిన ఎమ్మెల్యే సంజయ్ ..

కాంగ్రెస్ నాయకుడి హత్యపై హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. హత్యను తీవ్రంగా ఖండించారు. హత్యకు పూర్తి కారణాలు తెలుసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్‌ను ఆదేశించారు. నిందితులను, హత్యలో ప్రమేయం ఉన్న ఏఒక్కరినీ వదలొద్దని ఆదేశించారు. హత్యను రాజకీయకోణంలో చూడడం బాధాకరంగా ఉందన్నారు.

● వీఎస్ఎస్ చైర్మన్ నుంచి ...

జాబితాపూర్ గ్రామానికి చెందిన మారు గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో మంచి కార్యకర్తగా గుర్తింపు తెలచ్చుకున్నాడు. 40 ఏళ్ల కాలంలో వన సంరక్షణ సమితి అధ్యక్షుడి నుంచి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు జీవన్‌రెడ్డి ప్రధాన అనుచ రుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడి జాబితాలో గంగారెడ్డి పేరు కూడా ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

● పోలీసుల అదుపులో నిందితుడు?

గంగారెడ్డిని హత్యచేసి పారిపోయిన నిందితుడు బత్తిని సంతోష్ గౌడ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సంతోష్‌గౌడ్‌కు ఈ హత్యకు ఒక్కడికే సంబంధం ఉందా..? హత్యకు పాల్పడిన అనంతరం సంతోష్ గౌడ్ మరో కారులో పారిపోయిన సమయంలో మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు అనుమానించడం వారికి సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. హత్య చేసిన అనంతరం నిందితుడు తన ఫోన్‌ను కొద్ది దూరంలో పడేసి వెళ్లడం.. హత్యకు కొద్దిరోజుల ముందు జగిత్యాలరూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న దృశ్యాలను రీల్ చేసి సోషల్ మీడియాలో పెట్టడం చూస్తుంటే ఈ హత్య పక్కా స్కెచ్ ప్రకారమే చేసినట్లు తెలుస్తోంది. హత్యకు పాల్పడ్డ నిందితుడు సంతోష్‌గౌడ్ పై రౌడీ షీట్ కేసుతో పాటు గంజాయి సేవిస్తూ జులాయిగా తిరిగే వ్యక్తిగా పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. హత్య సంచలనంగా మారగా పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ బందోబస్తు నిర్వహించారు. జాబితాపూర్ గ్రామంతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల, ఇందిరా చౌక్‌కు భారీగా పోలీసులు మోహరించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ఆధార్, పాన్ కార్డ్‌లో ఫొటో మార్ఫింగ్

- బ్యాంకులో రూ. 20 లక్షల రుణం

- సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడి ఆవేదన



ఫేక్ డాక్యుమెంట్స్ చూపుతున్న నారాయణ

బుగ్గారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్, పాన్‌కార్డులోని తన ఫొటోలను మార్ఫింగ్ చేసి కేటుగాళ్లు బ్యాంకులో రూ. 20లక్షల రుణం తీసుకున్నారని ఓ బాధితుడు రెండు రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బుగ్గారం మండలం మద్దునూరు గ్రామానికి చెందిన రైతు ముంజాల నారాయణ జగిత్యాలలోని ఓ బ్యాంకులో పంట రుణం కోసం వెళ్లాడు. బ్యాంకు అధికారులు మీ పేరు మీద హైదరాబాద్‌లో ఏడు ప్రైవేటు బ్యాంకుల్లో సుమారు రూ. 20లక్షల రుణం ఉన్నట్లు చెప్పడంతో అవాక్కయ్యాడు. ఆయా బ్యాంకులకు వెళ్లి ఆరా తీయగా తన ఆధార్, పాన్ కార్డులోని ఫొటోలను మార్ఫింగ్ చేసి రుణం తీసుకున్నట్లు తేలింది. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను బాధితుడు కోరాడు. బాధితుడు నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం హైదరా బాదు నుంచి ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు నారాయణకు తరచుగా కాల్ చేసి క్రెడిట్ కార్డు బిల్లు రూ. 4 లక్షలు కట్టాలని ఒత్తిడి చేసేవారు. తాను ఎలాంటి లోన్ తీసుకోలేదని హెచ్చరించడంతో అప్పటి నుంచి కాల్స్ చేయడం మానేశారు. నాలుగు నెలల నుంచి మళ్లీ బ్యాంక్ నుంచి కాల్స్ రావడంతో ఇతరులకు సంబంధించిన ఫోన్లు తనకు వస్తున్నాయేమో అని నారాయణ అపోహ పడి అధికారులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిన సమయంలో నారాయణకు పంట రుణం మాఫీ కావడంతో జగిత్యాలలోని కెనరా బ్యాంకులో క్రాప్ లోన్ కోసం వెళ్లడంతో అసలు విషయం బయటపడింది. నారాయణ పేరుమీద అప్పటికే రూ. 20 లక్షల లోన్ ఉందని, వాటికి సంబంధించిన కిస్తీలు కడ్డటం లేదని బ్యాంకు అధికారులు తెలపడంతో నారాయణ అవాక్కయ్యాడు. వెంటనే జగిత్యాలలోని సైబర్ క్రైమ్ వారికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని దీనితో గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సైబర్ క్రైమ్ వాళ్లకి రిఫర్ చేశారని బాధితుడు నారాయణ తెలిపాడు.

హెల్మెట్ ఉండదు... ట్రాఫిక్ రూల్స్ పాటించరు

- ప్రమాదాలబారిన ద్విచక్రవాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే బాధితులు
- దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు



హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవితాలతో పాటు కుటుంబాలను అంధకారంలోకి నెడుతున్నారు. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలుకొని తెచ్చుకుంటున్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువ మంది జీవితాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో అధికశాతం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారే అధికంగా ప్రమాదాల భారిన పడుతుండటంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరుగుతోందని పోలీసులు చెపుతున్నారు.

మచ్చుకు కొన్ని...

➡ ఈ నెల 21న తుమ్మనపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ బ్రిడ్జీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మెన్ హెల్మెట్‌ను ధరించకపోవడం మూలంగా తలకు బలమైన గాయం కావడంతో అక్క డికక్కడే మృతి చెందాడు.

➡ హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ స్టేజి వద్ద హుజూరాబాద్ పట్టణంలోని మర్బుల్ షాపు యాజమాని, ఆర్ఎంపీ వైద్యుడు ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో యూటర్న్ వద్ద ఎదురుగా మరో వాహనం రావడంతో వాహనం అదుపు తప్పింది. సదరు వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు.

➡ హుజూరాబాద్ మండలం తుమ్మన్నపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ద్విచక్ర వాహనదారుల మృత్యువులకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. ఎన్‌హెచ్ఐ-563 పనుల కోసం వచ్చిన ఉపాధి హామీ కూలీలిద్దరూ తమ సొంత ఊరికి వెళ్లి తిరిగి పనులు జరిగే చోటికి అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ● తుమ్మన్నపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు విధుల్లో పాల్గొనేందుకు హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై బయల్దేరగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొ ట్టడంతో తల భాగానికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబం రోడ్డున పడింది.



కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న ద్విచక్రవాహనదారులు (ఫైల్)

ప్రమాద బీమాపై అవగాహన కరువు

రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో చాలా మంది జీవితాలే అర్థంతరంగా ముగుస్తున్నాయి. దీంతో వారి కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ పోషకుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబ సభ్యుల పరిస్థితి అగమ్యగోచారంగా మారుతుంది. వాహనలు నడిపే ప్రతి వ్యక్తి బాధ్యతగా ప్రమాద బీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మరణించినా.. అంగవైకల్యం వచ్చినా బీమా ఆదుకునే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన బీమా పథకాలపై అవగాహన లేక వాటిని కోల్పోతున్నారు.

ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

- కంచె వేణు,ఎంవీఐ, హుజూరాబాద్



వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం ద్వారా ప్రమాదాలు జరిగే అస్కారం చాలా తక్కువ. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బయటికి తీస్తున్న క్రమంలోనే హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తే.. అనుకొని ప్రమాదం ఏర్పడితే హెల్మెట్ ద్వారా తలబాగాన్ని కాపాడుకోవచ్చు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వట్టివాగు వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయలై చికిత్స పొందుతున్న కోరుట్ల పట్టణానికి చెందిన నీలం హిమశ్రీ(22) అనే యువతి సోమవారం రాత్రి మృతి చెందింది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న నీలం ప్రవీణ్ తన కూతురు హిమశ్రీని బైకుపై ఎక్కించుకోని మెట్‌పల్లి వస్తున్నాడు. పట్టణ శివారులోని వట్టివాగు వద్ద బ్రిడ్జిపై మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో ఇద్దరిరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హిమశ్రీ సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు, లారీ డ్రైవర్లపై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): అప్పులు, కుటుంబ కలహాలతో నేత కార్మికుడు మానేరు వాగులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన ఆడెపు తిరుపతి (40) తంగళ్లపల్లిలోని మానేరు వంతెన పైనుంచి వాగులోకి దూకే ప్రయత్నం చేస్తుండగా భార్య అడ్డుకుంది. ఘటను అటువైపుగా వెళ్తున్న వాహనాదారు గమనించి తిరుపతిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిపై దాడికి దిగడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు తిరుపతికి నచ్చజెప్పి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పులు, కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించినట్లు తిరుపతి పోలీసులకు తెలిపాడు. కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏఎస్సై చంద్రమౌళి తెలిపారు.

'శాతవాహన' సమాచారం

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి

- ఎస్‌యూ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య



వీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌యూ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలని, కొత్త కోర్సులకు అవకాశం కల్పించాలని ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్‌ను మంగళవారం శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య కోరారు. నూతనంగా శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతిగా నియమితులైన ప్రొఫెసర్ ఆచార్య ఉమేష్‌కుమార్‌ని శాతవాహన జేఏసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చి నూతన కోర్సులను తీసుకువచ్చి పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలన్నారు. అలాగే యూనివర్సిటీని పటిష్టం చేయాలని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు. దీనికి వీసీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌యూ జేఏసీ నాయకులు శనిగారపు అరుణ్ కుమార్, నైతం మహేష్, సత్యనారాయణ, రమేష్, తిరుపతి, అనిల్, శ్రీకర్, రవి పాల్గొన్నారు.

29 నుంచి బీఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలో బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29వ తేదీ నుంచి, మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 30నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు (సప్లిమెంటరీ) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ((రెగ్యులర్, సప్లిమెంటరీ) మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎమ్మెస్సీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో నిర్వహించిన ఎంఎస్సీ రెండో, నాలుగో సెమిస్టర్ గణితం (బ్యాక్‌లాగ్) పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాలు శాతవాహన వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి ఎస్‌యూ అంతర డిగ్రీ కళాశాలల క్రీడా పోటీలు

● షెడ్యూల్‌ను ప్రకటించిన స్పోర్ట్స్ బోర్డు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ అంతర డిగ్రీ, పీజీ కళాశాలల క్రీడా పోటీల షెడ్యూల్ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ మేరకు శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ క్రీడా షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను శాతవాహన యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన శాతవాహన యూనివర్సిటీ జట్టు దక్షిణ భారత అంతర యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడాంశాల్లో పోటీలతోపాటు ఎంపికలను నిర్వహించనున్నారు. మిగతా క్రీడాంశాల్లో నేరుగా ఎంపికలను నిర్వహిస్తామని ప్రకటించారు.

● క్రీడల షెడ్యూల్ ఇలా..

ఈ నెల 23న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలను పురుషుల విభాగంలో నిర్వహిస్తారు. 24న శాతవాహన యూనివర్సిటీ కళాశాల మైదానంలో మహిళలకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తారు. 25న కరీంనగర్ కార్ఖానగడ్డలోని డైనమిక్ జిమ్‌లో మహిళలకు, పురుషుల విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 26న కరీంనగర్ లారా జూడో అకాడమీలో మహిళలు, పురుషుల విభాగాల్లో జూడో క్రీడాంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. నవంబర్ 1న కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలు, పురుషుల విభాగాల్లో ఆర్చరీ అంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 2న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మహిళల విభాగంలో వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. 4న కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో పురుషుల విభాగంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తారు. 6న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో పురుషుల విభాగంలో ఖో-ఖో పోటీలను, 7న మహిళల విభాగంలో ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నారు. 13న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో మహిళలు, పురుషుల విభాగంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 14న యూనివర్సిటీలో క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తారు.

చారిత్రక ఖిల్లా



పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు మనసుకు నూతనోత్తేజాన్ని అందించడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో గల చారిత్రక ఖిల్లా కూడా పర్యాటకులను ఆకర్శించడంతో పాటు ఆలోచింపజేస్తోంది. జగిత్యాల పట్టణంలోని కోట, తెలంగాణ టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రంగా ఖిల్లా గుర్తింపు పొందింది. వందల ఏళ్ల నాటి కట్టడం చెక్కు చెదరకుండా ఉండటం విశేషం. ఖిల్లా కారణంగానే జగిత్యాలకు ఆ పేరు వచ్చిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

- టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రం
- ఐరోపా కోటతో పోలికలు
- రాష్ట్రంలో ఉన్న ఏకైక నక్షత్రాకారం కోట
- శత్రుదుర్భేద్యంగా ప్రత్యేక గదులు, కందకాలు, బావి, సొరంగం
- పర్యాటక శాఖ ఆదరిస్తే మరింత గుర్తింపు


జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో చారిత్రక కట్టడమైన జగిత్యాల ఖిల్లాను క్రీ.శ 1747లో ఎలగందుల కోటకు అధిపతిగా ఉన్న ముబారీ జాల్‌ముల్క్ జాఫరుదౌలా, మీర్జా ఇబ్రహీంఖాన్ 20 ఎకరాల విస్తీర్ణంలో ఖిల్లాను నిర్మించారు. 17వ శతాబ్దంలో ఇద్దరు యూరోపియన్ ఇంజనీర్లు జాక్, తాల్ ఈ ప్రాంతంలో నీటితో చుట్టుముట్టబడిన ఒక అందమైన నక్షత్ర ఆకారపు కోటను నిర్మించారు. ఈ ఇద్దరు ఇంజనీర్ల పేర్లు అయినా జాక్, తాల్ ప్రేరణ పొందిన ఈ ప్రదేశం తరువాత జగిత్యాల అని పిలిచేవారని స్థానికులు అంటున్నారు. ఈ కోట జాక్ తాల్ కోటగా ప్రసిద్ధి చెందింది. జగిత్యాల కోట రాయి సున్నంతో కట్టబడిన నక్షత్ర ఆకారపు డిజైన్‌లో ఉంటుంది. చుట్టూ లోతైన కందకం ఉండి ఆ కందకం ఇప్పటికీ నీటితో నిండి ఉంటుంది. 277 సంవత్సరాలు గడిచినా కోట చెక్కు చెదరలేదు. కోటలో నిర్మించిన కోనేరు ఎప్పటికీ నీటితో కలకల్లాడుతూనే ఉంటుంది. కోట లోపల మందుగుండు సామగ్రి నిల్వ చేసుకోవడానికి నిర్మించిన గదులున్నాయి. ఈ గదుల సమీపంలో వెనుక ద్వారం ఉందంటున్నారు.

● నక్షత్ర ఆకారపు కోట...

రాష్ట్రంలో నక్షత్ర ఆకారపు కోటగా జగిత్యాల ఖిల్లా గుర్తింపు పొందింది. మొఘల్ రాజవంశంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం హయాంలో దీనిని నిర్మించారు. కోటకు రెండు చెక్క ద్వారాలు ఉన్నాయి. మొఘల్ సార్వభౌమాధికారంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం పాలనలో నిర్మించబడిన ఈ కోట అత్యంత శక్తివంతమైన రాజవంశం ముద్రను కలిగి ఉంది. ఇది 264 మీటర్ల ఎత్తులో నిర్మించబడింది. దాని చుట్టూ మోతే చెరువు, ధర్మ సముద్రం చెరువు, ముపారపు, కండ్లపల్లి చెరువు అనే నాలుగు నీటి వనరులు ఉన్నాయి. కోట ప్రాంగణం అంతటా చెల్లాచెదురుగా ఉన్న భారీ ఫిరంగుల ఉనికి ద్వారా కోట అజేయంగా ఉన్న రోజులను ఇప్పటికీ గుర్తుచేస్తుంది. విదేశీ ప్రభావం కారణంగా ఈ కోట ఐరోపా కోటతో బలమైన పోలికను కలిగి ఉందన్న అభిప్రాయాలున్నాయి. జగిత్యాల ఖిల్లా ప్రత్యేక ఆకృతి, నిర్మాణం పలువురిని ఆకర్శింపజేస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులతో జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసి పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఇటీవల ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మూడో బహుమతి దక్కింది. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, పర్యాటక శాఖ అధికారులు ఖిల్లా అభివృద్ధిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



జగిత్యాల ఖిల్లా





నక్షత్ర ఆకారంలో నిర్మించిన కోట వ్యూ

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

- నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు

గణేశ్‌నగర్,అక్టోబర్ 22:(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. మై భారత్- నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్నటువంటి సమస్య అని అందులో మనదేశం కూడా ఉందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన అంశమని యువత దీనికి అలవాటు పడితే భవిష్యత్తు పాడవుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు, డ్రగ్స్ వినియోగంలో యువత శాతం ఎక్కువగా ఉంటుందని అలాంటి వారితో దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకునే వారి మానసిక స్థితి సరిగ్గా ఉండదని అలాంటప్పుడు వివిధ నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడితే తమ టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ నాగార్జున, శ్రీనివాస్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్, ఎం వెంకట్ రాంబాబు, డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ నెహ్రూ యువ కేంద్రం, రాములు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎక్సైజ్ శాఖ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ సైకాలజిస్ట్ జక్కని రాజు మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత ఎదుర్కొంటున్న వివిధ మానసిక సమస్యలు, నివారణ గురించి వివరించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరాగా స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షిం చారు.



ఆలయ ఆవరణలో భక్తులు

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు

గణేశ్‌నగర్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం అవుతున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు శిక్షణ కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి మీ పేర్లు నమోదు చేసుకోగలరని తెలిపారు. నైపుణ్య శిక్షణకు అర్హులు ఏడవ తరగతి ఆ పైబడిన తరగతి పాసైన, ఫెయిల్ అయిన 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలియజేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కోర్సు ఫీజు వివరాలు కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్, డీటీపీ)కి వెయ్యి రూపాయలు, బ్యూటీషియన్ కోర్సుకు 1500 రూపాయలు ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 9640967943, 9949850360 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హైబ్రిడ్ వంగడాలపై అవగాహన

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు హైబ్రీడ్ వరి వంగడాలు, వాటి ఉత్పాదకతపై వ్యవసాయ సంచాలకుల కార్యాలయం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కరీంనగర్ మండలం చామనపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు, వరి శాస్త్రవేత్త డాక్టర్ వీరన్నలు అవగాహన కల్పించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం, ఏఈవోలు సుచరిత, స్వర్ణలత, ఉదయ్, మైడితల్లి, డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వరి వంగడాలు, ఉత్పత్తులు, పత్తి సాగుపై అవగాహన కల్పించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కమాన్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా కోచ్ రమేష్, రవీందర్ తదితరులు అభినందనలు తెలిపారు.



ఆనంది

గ్రామోద్యోగ్ వికాస్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి



మాట్లాడుతున్న ఎన్ లతాదేవి

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, చిన్న తరహా సంస్థల పరిధిలో గల ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గ్రామోద్యోగ్ వికాస్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని గోవిందుపల్లిలో గల వీకేబీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన విలేజ్ ఇండస్ట్రీస్ అక్టివిటీస్ గ్రామోద్యోగ వికాస్ యోజన 2024-25 కార్యక్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ డీజీ ప్రసాద్‌శర్మ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎన్ లతాదేవీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ అంజనాదేవీ పలు అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ లతాదేవీ మాట్లాడుతూ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ దేశవ్యాప్తంగా ఉమ్మడి సౌకర్యాలు, సాంకేతిక ఆధునీకీకరణ, శిక్షణ మొదలైన వాటిని అందించడం ద్వారా గ్రామ పరిశ్రమల ప్రోత్సాహం, అభివృద్ధి కోసం గ్రామోద్యోగ్ వికాస్ యోజనను అమలు చేస్తుందన్నారు. 2024-25 సంవత్సరా నికి పథకం కింద అర్హత ఉన్న వ్యక్తులకు అందించడానికి అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇందులో శిక్షణ, సాధనాలను అందించడం జరుగుతుంద న్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు చేతి వృత్తులకు చెందిన వ్యక్తులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, చిన్న వ్యాపారులు పాల్గొన్నారు.

మూడు జాముల కొదురుపాక



గుట్టల మధ్య ఉన్న కొదురుపాక గ్రామం

- సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో తేడా
- 'గుట్టల' కారణంగానే ప్రత్యేక గుర్తింపు

తెలంగాణలోని పల్లెల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం ఇంచుమించు ఒకే సమయంలో ఉంటాయి. సాధారణంగా ఉదయం ఆరు గంటలకు సూర్యోదయం అయితే, సాయంత్రం ఆరు గంటలకు సాయంత్రం అవుతుంది. కానీ తమ గ్రామంలో మాత్రం ఒక గంట అలస్యంగా సూర్యోదయం అవుతుంది. అలాగే మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే తమ గ్రామంలో సూర్యాస్తమయం అవుతుందని ఆ ఊరి ప్రజలు చెబుతారు. అదే తమ గ్రామ ప్రత్యేకత అంటూ గర్వంగా చెప్పుకుంటారు.

సుల్తానాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా తెలంగాణలోని పల్లెల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అంటూ నాలుగు జాములను చెబుతారు.. కానీ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో మూడు జాములే ఉంటాయి.



తూర్పున ఉన్న గొల్లగుట్ట



పడమరన ఉన్న రంగనాయకుల గుట్ట

కానీ అందరూ నాలుగో జాము చూసే సమయంలో ఆ గ్రామ ప్రజలు రాత్రిని చూస్తున్నారు. ఇలా ఆ గ్రామ ప్రజలు మూడు జాముల(ఉదయం, మధ్యాహ్నం, రాత్రి)కే పరిమితమవుతున్నారు. ఈ గ్రామం చుట్టూ పెద్దపెద్ద గుట్టలు ఉండడమే ఇందుకు కారణం.. సుమారు 2వేల జనాభాగల కొదురుపాక గ్రామం 'మూడు జాముల కొదురుపాక' గానే ప్రపంచానికి తెలుసు.. అన్ని గ్రామాల్లో కంటే విభిన్నంగా గంట అలస్యంగా ఇక్కడి ప్రజలు సూర్యోదయాన్ని చూస్తారు. అంతటా సాయంత్రం ఆరు, ఏడు ప్రాంతంలో చీకట్లు అలుముకుంటే ఈ గ్రామంలో మాత్రం మధ్యాహ్నం మూడు, నాలుగు గంటలకే చీకటి పడుతుంది. పనుల మీద ఎవరైఎక్కడికైనా వెళితే ఠంచనుగా ఇంటికి చేరుకుంటారు. కారణం.. కొదురుపాక గ్రామం చుట్టూ నాలుగు వైపులా ఎత్తయిన గుట్టలు ఉన్నాయి. తూర్పున గొల్ల గుట్ట, పడమరన రంగనాయకుల గుట్ట, దక్షిణాన పాము గుట్ట, ఉత్తరాన నంబులాద్రి గుట్టలు ఉన్నాయి. వీటి మధ్య కొదురుపాక గ్రామం ఉంది. సూర్యుడు ఉదయించే సమయంలో గొల్లగుట్ట అడ్డుగా ఉండడం వల్ల గంట పాటు సూర్యోదయం ఆలస్యంగా అవుతుంది. అలాగే సూర్యుడు అస్తమించే పడమర వైపున రంగనాయకుల గుట్ట అడ్డుగా ఉండటంతో మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే గ్రామం చీకటిమయం అవుతుంది. ఇలా మూడు జాములకే పరిమితం అవడం వల్ల ఈ గ్రామానికి 'మూడు జాముల కొదురుపాకగా గుర్తింపు వచ్చింది.

గంట ఆలస్యంగా సూర్యోదయం..

-చాతరాజు రమేష్, యువకుడు, కొదురుపాక



మా గ్రామానికి తూర్పున ఉన్న గొల్లగుట్ట వల్ల సూర్యోదయం గంట ఆలస్యంగా అవుతుంది. అలాగే పడమర వైపున ఉన్న రంగనాయకుల గుట్టవల్ల సూర్యుడు పడమటి వైపు వెల్లగానే చీకటి అలుముకుంటుంది. ఇలా మా గ్రామానికి 3 జాములే ఉన్నాయి. అదే మా గ్రామ పేరుకు జతగా నిలిచి మూడుజాముల కొదురుపాకగా పేరుతెచ్చుకుంది. గుట్టల నడుమ గ్రామం ఉండటం వల్ల నాలుగో జామును ఇక్కడి ప్రజలు చూడలేకపోతున్నారు.

న్యూస్ బాక్స్

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తూ ఆలయాలపై దాడులకు నిరసనగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీజేవైఎం నాయకులు మంగళవారం ఆందోళనకు దిగారు. స్థానిక పాత బస్టాండులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆలయాలపై దాడులు చేసి విగ్రహాలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. దాడులు జరిగినా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించకపోవడం అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఆలయాలపై దాడి చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్తంభాల మార్పునకు స్థల పరిశీలన

వీర్నపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చేందుకు స్థల పరిశీలన చేసినట్లు సెస్ ఏడీ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశంతో కలిసి విద్యుత్ లైన్లను పరిశీలించారు. ప్రజలు నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో భాగంగా అడ్డుగా ఉన్న స్థంబాలను తొలగించి, మరోస్థానంలో ఏర్పాటుకు రూ.48 లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. రూ.10 లక్షలతో షిఫ్టింగ్ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. ఆయన వెంట సెస్ ఏఈ రమేశ్ ఉన్నారు.

మూగజీవాలపై కుక్కలదాడి

ఇల్లంతకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచారం గ్రామపంచాయతీ పరిధిలోని బోటిమీదిపల్లె గ్రామంలో మూగజీవాలపై ఊరకుక్కలు దాడి చేసి గాయపర్చాయి. గ్రామానికి చెందిన బాలయ్య, రవి, లచ్చయ్య తమ పశువులను ఇళ్ల వద్ద కట్టి వేశారు. సోమవారం రాత్రిపూట ఊర కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉన్నందున చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపెల్లి గ్రామానికి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. పత్తికుంటపల్లెకు చెందిన ఓరుగంటి అనిల్ ఇసుకను తరలిస్తున్నాడనే సమాచారం మే రకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆదివాసీ విప్లవవీరుడు కుమరం భీమ్



వేములవాడలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్యజ్యోతి): 'జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో దండు కట్టి పోరుబాట సాగించిన విప్లవ వీరుడు కుమరం భీమ్' అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ కార్యాలయంలో కొమురం భీమ్ జయంతిని నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, జడ్పీ మాజీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ ఎక్కడ పీడన ఉంటుందో అక్కడే స్వేచ్ఛ-హక్కుల కోసం గొంతుకలు లేస్తాయన్నారు. ఎక్కడ అణచివేత ఉంటుందో అక్కడే తిరుగుబాటు మొదలవుతుందన్నారు. ఎక్కడైతే నియంతృత్వం ఉంటుందో అక్కడ నిజమైన నాయకత్వం పురుడు పోసుకుంటుందని, కొమురం భీమ్ జీవిత చరిత్ర అందుకు ఉదాహరణ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నారం శ్రీనివాస్ బీఆర్ఎస్ తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, తంగళ్లపల్లి మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంభాల మల్లారెడ్డి, మిట్టపల్లి జవహర్‌రెడ్డి, పోచవేణి ఎల్లయ్యగౌడ్, తంగళ్లపల్లి యూత్ అధ్యక్షుడు అవదూత మహేందర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్, మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేష్, అనిల్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కొమురం భీం జయంతిని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొమురం భీం పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, నాయకులు సుభాష్, సీత్యానాయక్, శంకర్‌నాయక్, బాలరాజునర్సాగౌడ్, బాల్‌రెడ్డి, మధు, జబ్బార్, ప్రభునాయక్, దేవరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో మంగళవారం లంబాడీ ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో కొమురం భీం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గిరిజన నాయకులు రాజు నాయక్, మోహన్ నాయక్, కిషన్ నాయక్, సాగర్ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: గిరిజన ఉద్యమ నాయకుడు కొమరం భీమ్ జయంతిని వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.శేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వి.అంజయ్య, అధ్యాపకులు మహేందర్, జయ భరత్ రెడ్డి, గోపి, మహేందర్ రెడ్డి, సంతోష్, దేవయ్య, రవీందర్, అశోక్, శ్రీనివాసరావు, మంగమ్మ, లత, అరుణ, స్వప్న, జ్యోతి, దీపిక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న గిరిజన ఐక్యవేదిక నాయకులు

డిజిటల్ సర్వే లేనట్లేనా?

5వ పేజీ తరువాయి

జిల్లాలో క్రాప్ బుకింగ్ ద్వారా ఇప్పటికే సాగు లెక్కలు పూర్తి చేశారు. మరోవైపు వరికోతలు, పత్తి ఏరడం మొదలైంది. కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సర్వే ప్రకారం 2.32 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. ప్రధానంగా వరి 1.80 లక్షల ఎకరాల్లో, పత్తి 49,332, పెసర 56.26, కందులు 939, ఇతర పంటలు 122 ఎకరాల్లో సాగు చేశారు. దీనికి సంబంధించి క్రాప్ బుకింగ్ చేసినా డిజిటల్ సర్వేకు మాత్రం ఏఈవోలు దూరంగా ఉన్నారు. గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి ఒక్కొక్కరే పనిచేయడం సాధ్యంకాదని, అదనపు సిబ్బందిని ఇవ్వాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం

5వ పేజీ తరువాయి

ఆంధ్రజ్యోతి : ఎన్ని కేంద్రాలను ప్రీస్కూల్‌గా మార్చారు?

జిల్లా సంక్షేమ అధికారి: జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 292 కేంద్రాలను ప్రీస్కూల్‌లుగా మార్చాం. పూర్వ విద్యను అందించేందుకు టీచర్లకు శిక్షణ ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి : ఎంతమంది పదవీవిరమణ పొందారు?

జిల్లా సంక్షేమ అధికారి: సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు 65 సంవత్సరాలు నిండిన టీచర్లు, ఆయాలకు ప్రభుత్వం పదవీ విరమణ కల్పించింది. జిల్లాలో 123 మంది పదవీ విరమణ పొందారు. ఇందులో 98 మంది ఆయాలు, 25 మంది టీచర్లు ఉన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో అయాలకు పదోన్నతులు కల్పించడానికి రోస్టర్ పాయింట్లను సిద్ధం చేశాం.

ఆంధ్రజ్యోతి : అంగన్‌వాడీ సొంత భవనాల పరిస్థితి ఏంటి..

జిల్లా సంక్షేమ అధికారి: జిల్లాలో 257 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా 158 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. 172 ప్రభుత్వ పాఠశాలల గదుల్లో కొనసాగుతున్నాయి. 49 భవనాల నిర్మాణం కొనసాగుతున్నాయి. 98 కేంద్రాలకు భవనాలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

ఆంధ్రజ్యోతి : కేంద్రాల్లో ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

జిల్లా సంక్షేమ అధికారి: జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ప్రస్తుతం 43,646 మంది లబ్ధిదారులు ఉన్నారు. బాలామృతం ప్యాకెట్లు, కోడి గుడ్లు, ఒక పూట సంపూర్ణభోజనం, ప్రతీ రోజు కోడి గుడ్డు, పాలు వంటివి అందిస్తున్నాం. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందిస్తున్నాం. ప్రధానంగా పోషకాహారం అవగాహన కల్పిస్తున్నాం.

కుళ్లిన కోడిగుడ్లు

ముస్తాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతుగల్ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిపోయిన కోడిగుడ్లను లబ్ధిదారులకు అందించడంపై గ్రామస్థులు మండిపడ్డారు. కోడిగుడ్లు వచ్చాయని సమాచారం ఇవ్వడంతో సెంటర్‌కు వెళ్లగా కుళ్లిపోయిన గుడ్లను అందించారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారీతిన అందిస్తున్నారని మండిపడ్డారు. కోడి గుడ్లను సరఫరా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

అచేతన స్థితిలో వృద్ధురాలు

- శ్మశాన వాటిక వద్ద గదిలో వదిలేసిన బంధువులు
- అధికారుల జోక్యంతో బంధువుల ఇంటికి

తంగళ్లపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): అచేతన స్థితిలో స్థితిలో ఉన్న వృద్ధురాలిని శ్మశాన వాటిక గదిలో వదిలేశారు. సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవడంతో స్పందించిన అధికారులు ఆమెను ఇంటికి చేర్చారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తంగళ్లపల్లికి చెందిన కూకట్ల రాజవ్వ (62) గతంలో గ్రామ పంచాయతీ కార్మికురాలిగా పని చేస్తుండేది. భర్త మృతి చెందగా పిల్లలు లేని రాజవ్వ ఒంటరిగా జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో అనారోగ్యంతోపాటు వృద్ధాప్యం మీద పడింది. రాజవ్వ సోదరుడి కుమారుడు తిరుపతి చేరదీసి తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చాడు. నాలుగు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురవడంతో సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రిలో మూడు రోజులపాటు వైద్యం చేయించారు. పరిస్థితి విషమించడంతో బంధువులు తంగళ్లపల్లి శ్మశాన వాటికలోని ఓ గదిలో ఉంచారు. శ్మశాన వాటికిలో వృద్ధురాలిని వదిలేశారని సోషల్ మీడియాలో వీడియో వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జయంత్‌కుమార్, పోలీసులు బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అచేతన స్థితిలో ఉన్న రాజవ్వను బంధువు తిరుపతి ఇంటికి చేర్చారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

చందుర్తి,(రుద్రంగి) అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. ఆయా సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. అనంతరం కిచెన్, స్టోర్ రూం పరిశీలించారు. పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. ఆర్అండ్‌బీ డీఈ శాంతయ్య, డీఈవో రమేష్ కుమార్ పాల్గొన్నారు.

చందుర్తి: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నూతన భవనం తుది దశ పనులు పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. చందుర్తి మండల కేంద్రంలో రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.కోటి 56 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు చేపట్టగా మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతన భవనంలోని గదులు, ఆవరణను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. భవనంలో తుది దశ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పురాతన భవనం నుంచి నూతన భవనంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్యాధికారి సంపత్ కుమార్‌కు సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఇల్లంతకుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గాలిపెల్లి, వల్లంపట్ల, కందికట్కూర్, ఇల్లంతకుంట తదితర పాఠశాలల్లో మంగళవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైరవీలు, లాబియింగ్‌లకు కాలం ముగిసిందన్నారు. డీఏ, పీఆర్సీ వంటి పెండింగ్ బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదినెలల పాలనలో మొదటి ఉపాధ్యాయ ఉద్యమం చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బ్రహ్మచారి, శ్రీనివాస్, మహిపాల్, లక్ష్మీనర్సింహస్వామి, యాద రవి, కొమురయ్య పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి సేవలు అందించాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వచ్చిన ఏవో కవితను మంగళవారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు పంట సాగు విధానాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఏఈవో శ్రీశైలం, నాయకులు నర్సయ్య, గౌస్, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మంగళవారం కుక్కలు దాడి చేయడంతో హార్థిక్ అనే బాలుడు గాయపడ్డాడు. బాలుడు ఇంటి ముందు ఆడుకుంటున్న క్రమంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. గాయాలపాలైన బాలుడిని కుటుంబసభ్యులు, స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాపాడాలని కోరుతున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వేములవాడ రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిన దాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాత్రాజుపల్లి, వట్టెంల గ్రామాలలో నిన్న రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన దాన్యాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. దాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్యాక్స్ డైరెక్టర్ రాజయ్య, మ్యాకల శ్రీనివాస్, గుడిసె అనీల్, బాలయ్య, సాయి గౌడ్, స్వామి రెడ్డి, మధుసూధన్, శ్రీనివాస్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

చందుర్తి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అఫ్జల్ బేగం అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు ఉన్నారు.

ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకుల హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులు తమ సమస్యలను తెలిపేందుకు పోలీసులు ఫిర్యాదు బాక్సులను ఏర్పాటు చేయాలని, వాటిపై నిఘాను పెంచాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతోపాటు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ అఖిల్ మహాజన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో తరచూ అనేక సంఘటనలతో విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, లా ఫోరమ్ విభాగ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

వేములవాడ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలో తిప్పాపూర్‌లో మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేస్తూ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా పొలసకు చెందిన వ్యక్తి వేములవాడ మీదుగా సిరిసిల్ల వైపు మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేశాడు. తిప్పాపూర్‌లో రోడ్డు పక్కన నిలిపి ఉన్న మూడు ద్విచక్రవాహనాలను, ఒక ఆటోను అక్కడే నిలుచున్న ఓ వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో వేములవాడ మండలం శాభాష్‌పల్లికి చెందిన పర్శారాం అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా వెంటనే ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిని తొలగించాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన తెలుగు ఉపాధ్యాయుడు నరేందర్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు



సిరిసిల్లలో దీక్ష శిబిరంలో నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : తాజా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను తెలంగాణ ప్రభుత్వం విడదల చేయాలని, ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని తాజా మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సురివి యాదయ్యగౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పచంలు నాడు గ్రామాల అభివృద్ధి కోసం అప్పులు చేసి పనులను చేపట్టారన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా పెండింగ్ బిల్లులు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేసిందన్నారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లామని, సానుకూలంగా స్పందించిన మంత్రులు బిల్లుల విడదల చేయడానికి మాత్రం స్పందించడం లేదని అన్నారు. అప్పులు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని, పెండింగ్ బిల్లులను వెంటనే విడదల చేయాలని డిమాండ్ చేశారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ మాట్లాడుతూ జిల్లాలో రిలే నిరాహార దీక్షలు ఈ నెల 28 వరకు కొనసాగుతాయని, ప్రభుత్వం స్పందించక పోతే భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట దీక్షలకు మద్దతు తెలిపారు. అనంతరం నవంబరు 4న చేపట్టే చలో హైదరాబాద్ పోరుబాట పోస్టర్ ఆవిష్కరించారు. వేములవాడ రూరల్, అర్బన్, బోయినిపల్లి మండలాల తాజా మాజీ సర్పంచులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శులు వల్లగొండ వేణుగోపాల్‌రావు, కీర్తిరెడ్డి, వెంకట నరసింహరెడ్డి,

ఉద్యమకారుల సంక్షేమానికి
పెద్దపీట వేయాలి

వేములవాడ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయాలని తెలంగాన ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ అన్నారు. ఉద్యమకారులకు అన్ని విధాల న్యాయం చేయాలని కోరుతూ మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్ వరకు చేపట్టిన పాదయాత్ర మంగళవారం సాయంత్రం వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఉద్యమనాయకులు వారికి స్వాగతం పలికారు. అపంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యమకారులను పూర్తిగా మోసం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీలను అమలు చేయాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, హెల్త్‌కార్డు, ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ సౌకర్యం, సంక్షేమ భవనంతోపాటు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారులకు సీట్లు కేటాయించాలన్నారు.

అయోడైజ్డ్ ఉప్పు ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి



ప్రచార ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వసంతరావు

సిరిసిల్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అయోడైజ్ ఉప్పు ప్రాధాన్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంత రావు సూచించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గ్లోబల్ అయోడిన్ డెఫీషియెన్సీ డిజార్డర్స్ ప్రీవెన్షన్ డేగా నిర్ణయించిందని, ఇందులో భాగంగా వారం రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలపై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోడిన్ ఉప్పు వాడకపోవడంతో గర్భస్రావం, గొంతు వాపు, శిశు జననంలో మార్పులు, బరువు తక్కువగా ఉండడం వంటివి కలుగుతాయని పేర్కొన్నారు. అయోడైజ్ ఉప్పు వినియోగంతో శారీరక ఆరోగ్యం, జ్ఞాపక శక్తి వంటి లాభాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా చీర్లవంచలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోలు డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ రజిత, వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ, డీపీవో ఉమాదేవి, రాజ్‌కుమార్, సత్యనారాయణ, హెచ్ఎం రవీందర్, కవిత పాల్గొన్నారు.

- జిల్లాలో వివిధ కార్యక్రమాలను నమోదు చేయడానికి అవసరమయ్యే రిజిస్టర్‌లను ఆశా వర్కర్లకు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు పంపిణీ చేశారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిజిస్టర్‌లను అందజేసి పలు సూచనలు చేశారు. డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వోలు డాక్టర్ రజిత, డాక్టర్ రాజగోపాల్, ఎన్‌హెచ్ఎం రవీందర్, అశావర్కర్లు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇల్లంతకుంట, అక్టోబరు 22: యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్లుగా దళితులకు అవకాశం కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు మచ్చ రాజేశం మాట్లాడుతూ గత ప్రభుత్వం దళితులను విస్మరించిందన్నారు. దళితబంధు పేరుతో ఓట్లు దండుకోవడానికి మాత్రమే ప్రయత్నించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల ఆత్మగౌరవం పెరిగేలా పని చేస్తుందన్నారు. దళితుల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ప్యాక్స్ మాజీ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, నాయకులు పసుల వెంకటి, తాట్ల వీరేశం, బడుగు లింగం, సురేందర్‌రెడ్డి, మామిడి నరేష్, జమాల్ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కన్వీనర్ దేవదాస్

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను ఆశిస్తూ తలపెట్టిన ఆత్మ గౌరవ సభను విజయ వంతం చేయాలని మాదిగా, మాదిగా ఉపకులాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ కత్తెర దేవదాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అలు పెరగని ఉద్యమం చేశారన్నారు. దీని ఫలితంగా రెండు నెలల క్రితం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ చేయాలని ఆదేశాలను ఇచ్చిన నేపథ్యంలో సిరిసిల్ల ప్రాంత మాదిగ, మాదిగ ఉపకులాలు సంబరాలు జరుపుకునే సమయం ఆసన్నమైందన్నారు. ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉదయం సిరిసిల్ల పట్టణ ప్రధాన రహదారుల గుండా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. అంబేద్కర్ చౌరస్తావద్ద ఆత్మగౌరవ సభను నిర్వహిస్తామన్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరుకానున్నట్లు చెప్పారు. ఐక్యవేదిక నాయకులు, ఆవునూరి వెంకటరాములు, బొడ్డు నారన్న, లింగంపల్లి సత్యనారాయణ, గడ్డం కిరణ్, నేదూరి లక్ష్మన్, మంద నరేష్, సురేందర్, నరేష్ పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం.. అందని వేతనం

చందుర్తి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఆదార్ నంబర్ అనుసంధానంలో అధికారుల తప్పిదంతో ఓ కూలీ వేతనం మరో వ్యక్తి బ్యాంకు ఖాతాలో జమ కావడంతో ఇబ్బంది పడుతున్నాడు. చందుర్తి మండలం లింగంపేటకు చెందిన కర్ల నర్సయ్య అనే ఉపాధిహామీ కూలీ ఏప్రిల్, మే, జూన్‌లో గ్రామంలోని బరుసులగండి ప్రాంతంలో కాంటూర్ కందకాల తవ్వకం పనులకు వెళ్లాడు. అప్పటి నుంచి వేతనం బ్యాంక్ ఖాతాలో జమ కావడం లేదని అధికారులకు దృష్టికి తీసుకెళ్తున్నాడు. చివరకు అధికారులు లోపం ఎక్కడ జరిగిందని పరిశీలించగా రుద్రంగి చెందిన మరో కర్ల నర్సయ్య అనే పేరు గల వ్యక్తి బ్యాంకులో జమైనట్లు గుర్తించారు. లింగంపేట చెందిన కర్ల నర్సయ్య అసలైన ఉపాధిహామీ కూలీ రుద్రంగి నర్సయ్య వద్దకు వెళ్లి డబ్బులు అడిగినా ఇవ్వ కుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో అధికారులు రుద్రంగికి చెందిన నర్సయ్య బ్యాంకు ఖాతాను బ్లాక్ చేశారు.